# అమృత సోపానము

## తిరుమల కాలినడక దివ్యచరిత్ర

రచన

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**
(T.V.R.K. Murthy, M.Tech)

శ్రీం

**శ్రీ డిజైన్స్**
**Vedic Business Consultants**
**www.shridesigns.net**
**Phone : 040- 65885750.**
**హైదరాబాదు**
**2008**

# అమృత సోపానము

## తిరుమల కాలినడక దివ్యచరిత్ర

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

© సర్వహక్కులు రచయితవి.

ప్రథమ ముద్రణ

**2008**

వెల :

అమూల్యము

కాపీలకు
**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No.204, 'Vijaya Towers'
Kalyan Nagar Phase-III,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, A.P., India.
Email : viswapathi@yahoo.com &
tvrkmurthy@yahoo.com
Ph :040 - 65885750,
Mobile : 98494 43752

Designed & Printed at :
**SRI VASAVI GRAPHICS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9247797342.

# నివేదన

వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తికించన
వేంకటేశ సమోదేవో నభూతో నభవిష్యతి

ఈ బ్రహ్మాండములో వేంకటాద్రిని మించిన పవిత్ర ప్రదేశం మరొకటి లేదు. శ్రీ వేంకటేశ్వరునితో సమానమైన దైవం ఇంతకు ముందు లేదు. ఇక తర్వాత ఉండబోదు. సాక్షాత్తు ఆ వైకుంఠ వాసుడైన శ్రీమన్నారాయణుడే మనందరినీ అనుగ్రహించటానికి ఈ కలియుగంలో భూలోకంలో పవిత్ర తిరుమల కొండపై శ్రీనివాసునిగా అవతరించాడు.

ఆ శ్రీనివాసుని లీలలు అద్భుతం, నమ్మిన వారికి కొంగుబంగారం, అనంతుడు, ఆపద మొక్కులవాడు. తరతరాలుగా స్వామి తనను నమ్మిన వారిని రక్షిస్తూ వారికి ముక్తిని ప్రసాదిస్తున్నాడు.

నా తల్లిదండ్రులైన కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నర్సింహారావు గారు, తల్లి శ్రీమతి నాగరత్నాంబ గార్లు ఆ శ్రీనివాసుని ఎన్నో విధాల సేవించి తమ జీవితం ధన్యం చేసుకున్నారు. నా చిన్న తనంలో మా తండ్రిగారు రోజూ చదివే శ్రీవారి సుప్రభాతం నాలో స్వామిపై భక్తిని ప్రేరేపించింది. అది మొదలు ఆ స్వామియే నాకు సర్వస్వం. చదివింది ఇంజనీరింగ్ అయినా మనస్సెప్పుడూ వేదశాస్త్రాల మీదనే ఉండేది. ఎల్లప్పుడూ శ్రీనివాసుడే నా మదిలో మెదిలేవాడు.

నేను ఏలూరు తాలూక, పోతునూరు గ్రామంలో 1956 లో మా మాతామహుల ఇంట్లో జన్మించాను. నా విద్యాభ్యాసం అంతా పోతునూరు, నాగార్జునసాగర్, హైదరాబాద్, వరంగల్‌లలో జరిగింది. 1983 లో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్ నుంచి ఎం.టెక్ చదివిన నేను 1988 దాకా ఆల్విన్ కంపెనీలోను, అటు పిమ్మట 1998 వరకు మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీలోను ఉద్యోగం చేయడం జరిగింది. అప్పటి నుంచి వివిధ బిజినెస్ సంస్థలకు వేదశాస్త్రాల ఆధారంగా కంపెనీల పేర్లు సూచించడం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. అన్ని సంస్థలు ఎంతో అభివృద్ధి చెంది వివిధ రంగాలలో అత్యున్నత స్థానంలో ఉన్నాయి. ఇదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప వేరొకటి కాదు.

ఆ శ్రీనివాసునికి తన భక్తులంటే అత్యంత ప్రేమ. మనం అహంకారాన్ని, ఈ ఇహలోక విషయాలపై మమకారాన్ని వదిలి ఆ స్వామిని ప్రార్థిస్తే అన్నీ తనే చూసుకుంటాడు. కలియుగంలో ఇంతకుమించిన దైవం మరొకరు లేరు. ఇందువలననే తిరుమలను రోజూ కొన్ని వేలమంది దర్శిస్తూ, స్వామివారిని సేవిస్తున్నారు.

ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో గతంలో శ్రీ శ్రీనివాస మాహాత్మ్యం, శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ వేంకటేశ్వర దర్శనం, Sri Srinivasa - Lord of Seven Hills అనే పుస్తకాలు రచించడం జరిగింది. నా పూర్వజన్మ పుణ్యఫలం చేత వ్రాసిన ఈ పుస్తకాలు శ్రీవారి కరుణా కటాక్షాలతో ఎంతో ప్రజాదరణ పొందాయి. కాలినడకన తిరుమల కొండ ఎక్కి స్వామిని దర్శించడం వెనుక ఎన్నో దివ్య రహస్యములు కలవు. ఎన్నో జన్మల పుణ్యఫలంచేత గానీ తిరుమల కాలినడకన వెళ్ళి స్వామిని దర్శిద్దామనే తలంపు కలుగదు. ప్రస్తుత ఈ రచన “అమృత సోపానం” కూడా గత రచనల మాదిరిగానే స్వామివారి అనుగ్రహంతోనే సాధ్యమైంది.

నా రచనలన్నీ వ్రాసింది నేనైనా నాచే వ్రాయించింది ఆ స్వామివారే... కేవలం కలం మాత్రం నేను పట్టుకున్నాను. అంతే... సాక్షాత్తూ స్వామివారే ప్రతి అక్షరానికి ప్రేరణ. ప్రతి పదం శ్రీనివాసుని నామాలే.

నిత్యం స్వామివారిని ఎందరో భక్తులు కాలినడకన కొండ ఎక్కి దర్శించుకుంటున్నారు. సమస్త దేవతలూ కూడా ఈ వేంకటాద్రిని దివ్య రూపాలలో నడిచి, ఎక్కి స్వామిని నిత్యం దర్శించుకొనడం జరుగుతున్నది.

శ్రీనివాసుని లీలలు అద్భుతం, ఆ స్వామిని మనసారా కొలిస్తే అంతటి మహత్తర దేవుడు మరొకరు మనకు కనబడరు. శ్రీ వేంకట తత్వాన్ని అర్థం చేసుకుంటే అంతకు మించిన బ్రహ్మానందం మరొకటి ఉండదు.

తిరుమల అద్భుత పవిత్ర ప్రదేశం. తిరుమలలో మనం ఏకాంతంగా ఏ ప్రదేశం లోనైనా కూర్చుని కళ్ళు మూసుకుని ప్రశాంత చిత్తంతో ధ్యానిస్తే ఓంకారనాదం స్పష్టంగా వినిపిస్తుంది. మన హృదయాలలో ప్రతిధ్వనిస్తుంది. అంతేకాక వేదాలు, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాల విశేషాలు వినిపిస్తాయి. ఇప్పటికీ ముక్కోటి దేవతలు, మహా మునులు అనేక దివ్య రూపాలలో సంచరిస్తున్న పవిత్ర ప్రదేశం తిరుమల. ఎన్నో జన్మల పుణ్యఫలం వలనే తిరుమలపై కాలు పెట్టే భాగ్యం, శ్రీవారి దర్శన భాగ్యం కలుగుతుంది.

ఈ పుస్తక రచన సమయంలో నా ధర్మపత్ని శ్రీమతి వెంకట రుక్మిణీ వైదేహి, కుమార్తెలు : చి॥ ఆనంది, చి॥ ఆముక్త, కుమారుడు చి॥ ఆదిత్య శ్రీనివాసులు ఎంతో సహకరించారు. ఈ పుస్తకాన్ని చక్కగా డి.టి.పి. చేయించి అచ్చు వేయించిన శ్రీ వాసవీ గ్రాఫిక్స్ శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు ఆ శ్రీ లక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఆ పుస్తక ప్రచురణలో ఎంతో మంది శ్రీవారి ప్రియ భక్తులు ఎంతో సహకరించారు. ఇదంతా కూడా కేవలం స్వామివారి ప్రేరణ అనుకుంటున్నాను. వీరందరికి, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

భక్తికి ఎటువంటి ఎల్లలూ లేవు. చిన్న భక్తుడు, పెద్ద భక్తుడు అని ఎప్పుడూ ఉండరు. భక్తి ఒక అమృత స్రవంతి. అందరి భక్తికి మూల పురుషుడు ఆ శ్రీమన్నారాయణుడు ఒక్కడే. ఆ శ్రీనివాసుని ఆప్తులైన మీ అందరికీ నా నమస్కారం.

నా ప్రతి రచనా సమయంలోనూ ఎన్నో విధాల సహకరిస్తున్న శ్రీమతి & శ్రీ ఎల్లాప్రగడ వేంకట రమణమూర్తి, శ్రీమతి & శ్రీ ఎల్లాప్రగడ వేంకట శ్రీనివాస మూర్తి, శ్రీమతి & శ్రీ వై.బి.యస్.మూర్తి, హైదరాబాద్, శ్రీమతి & శ్రీ పి.రామకృష్ణారావు, తిరుపతి దంపతులకు ఎన్నో కృతజ్ఞతలు. వారికి, వారి కుటుంబాలకు ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఇంతటి భాగ్యాన్ని ఇచ్చిన ఆ పరబ్రహ్మ మూర్తికి ఇవే నా ప్రణామములు. ఎల్లప్పుడూ ఆ శ్రీవారి సేవలోనే గడుపుతాననీ, శ్రీ వేంకట తత్వాన్ని ప్రజలందరి హృదయాలకు చేరువగా తీసుకువెళ్లడమే నా జీవిత గమ్యం అని ఆ స్వామివారికి విన్నవించు కుంటున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసులను ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః
శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం

తిమ్మరాజు విశ్వపతి రామ కృష్ణమూర్తి

హైదరాబాద్.

# అంకితము

నా మామగారు, అత్తగారులైన కీ॥శే॥ బ్రహ్మశ్రీ వల్లూరు వేంకట వాసుదేవ ఆనందరావు, శ్రీమతి వల్లూరు శ్రీవాణి గారల ప్రీత్యర్థముగా తిరుమల శ్రీ శ్రీనివాసుని దివ్య చరణారవిందములకు నా ఈ ''అమృత సోపానము'' గ్రంథమును భక్తితో సమర్పిస్తున్నాను.

**విశ్వపతి**

# ఫలశృతి

భగవంతుడికి సంబంధించిన ఏ పుస్తకమైనా చదవడానికి ఎటువంటి నియమ నిబంధనలు వుండవని నా విశ్వాసం. వయస్సుతోగానీ, కులంతో గానీ, ఏ నిమిత్తమూ లేదు. మనస్సు నిర్మలంగానూ, శరీరం శుభ్రంగానూ ఉంటేచాలు. ఎవరైనా, ఏరీతిలోనైనా, ఏరోజైనా, ఏప్రదేశంలోనైనా చదువుకొనవచ్చును. ఆ శ్రీమన్నారాయణుని గురించిన పుస్తకం చదవడానికి కావలసినది నిర్మల భక్తి తప్ప మరొకటి కాదు. ఎటువంటి కఠోర నిష్టలు, ఉపవాసాలు అవసరం లేదు.

ఇకపోతే భగవంతునికి సంబంధించిన స్తోత్రాలకు, పారాయణ గ్రంథాలకి కొన్ని కొన్ని ప్రత్యేక పర్వ దినాలలోను, వైకుంఠ ఏకాదశి లాంటి పవిత్ర దినాలలోనూ చదివితే తప్పకుండా ఫలితం రెట్టింపుగా ఉంటుంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు.

ఏకాదశి శ్రీనివాసునికి అత్యంత ప్రీతికరమైనది. ప్రతీ ఏకాదశి తిథినాడు చదివిన ఎడల సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. ఎటువంటి అనారోగ్యము దరిచేరదు. అలాగే ప్రతీనెలా శ్రవణా నక్షత్రం నాడు చదివినవారికి సర్వ ఐశ్వర్యాలూ కలుగుతాయి. శరీరము, వయస్సు సహకరిస్తే కనీసం సంవత్సరంలో ఏ ఒక్క ఏకాదశినాడైనా చదివితే మరు జన్మ ఉండదు. జీవించినంతకాలం సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందుతారు. శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన ఏ పర్వదినాలలో చదివినా విశేష ఫలం లభిస్తుంది.

వయో భారం చేతగానీ, అనారోగ్య సమస్యలవలన గానీ, ఆర్థిక బాధల వలనగానీ, మరే ఇతర కారణములచేత గానీ కొండ నడిచి ఎక్కలేనివారు ఈ పుస్తకమును చదివినచో నడిచి ఎక్కి, శ్రీనివాసుని దర్శించిన ఫలం సిద్ధించగలదు. తిరుమలలో ఉన్న సమయములో చదివిన ఎడల వేయి అశ్వమేథయాగ ఫలం సిద్ధించగలదు.

మీకు వీలున్న ఏ రోజైనా, ఏ రీతిలోనైనా చదివి శ్రీనివాసుని అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యంతో, సర్వ సంపదలతో కలకాలం సుఖముగా జీవించవచ్చును.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !

– తిమ్మరాజు విశ్వపతిరామకృష్ణమూర్తి.

# అమృత సోపానము

## తిరుమల కాలినడక దివ్యచరిత్ర

ఈ బ్రహ్మాండములో వేంకటాద్రికి మించిన దివ్య ప్రదేశం మరొకటి లేదు. ఎల్లవేళలా శ్రీమన్నారాయణుడు కొలువుండే ఈ తిరుమల అత్యంత వైభవోపేతమైనది. ఈ వేంకటాద్రి అత్యంత మహిమాన్వితమైనది. ఎన్నో జన్మల పుణ్యఫలం చేత గానీ ఈ కొండపై కాలుపెట్టే భాగ్యం కలుగదు. ఈ వేంకటాద్రి వైభవం వర్ణించడానికి వేయినాలుకలున్న ఆదిశేషునికి కూడా సాధ్యం కాదు. సమస్త విజ్ఞాన సారము, సర్వ వేదసారము, పురాణ ఉపనిషత్తులసారము గ్రహించినా కూడా ఈ వేంకటాద్రి విశిష్టతలో కోటి వంతు కంటె తక్కువే అని తెలుసుకొనగలుగతాము.

ఇంతటి పవిత్రమైన ఈ కొండ నడిచి ఎక్కి శ్రీనివాసుని దర్శనం చేసుకుంటే జన్మ జన్మల పాపాలూ నశిస్తాయి. ఎంతో పూర్వజన్మ పుణ్యఫలం చేతగానీ వేంకటాద్రి కాలినడకన స్వామి దర్శనం చెయ్యాలనే తలంపు



కలుగదు. సమస్త దేవతలూ ఈ వేంకటాద్రిని దివ్యరూపాలలో నడిచి ఎక్కి స్వామిని దర్శించుకోడానికి ఉవ్విళ్ళూరుతుంటారు. నిత్యం కాలినడకన తిరుమల చేరి స్వామి దర్శనానికి వచ్చేవారిని చూస్తూ తమకు కూడా మానవ జన్మ కలిగితే ఎంత అదృష్టమో కదా అని తలుస్తుంటారు. దివ్యరూపు లైనటువంటి తమకి అంతటి భాగ్యం లేదు కదా అని వాపోతుంటారు.

పూర్వకాలంలో ఇంద్రుడు ఒకసారి భూలోక విహారానికై వచ్చి ఒక బ్రాహ్మణోత్తమునితో కలహించి అకారణముగా అతనిని నిందించాడు. ఆ అవమానమును భరింపలేక ఆ విప్రుడు మరణించాడు. బ్రహ్మ హత్యా పాతకము ఇంద్రుణ్ణి వెంటనే చుట్టుకున్నది. ఇంద్రుడి సర్వ శక్తులూ సన్నగిల్లసాగాయి. జరిగినదంతా ఇంద్రుడు గ్రహించి ఈ బ్రహ్మ హత్యాపాతకమును ఏవిధంగా పోగొట్టుకొనవలెనా ఎంతో మథన పడసాగాడు. ఇలా కొన్ని రోజులు గడిచి చిక్కి, శల్యమయ్యాడు. ఇంతలో ఒకరోజున త్రైలోక్య సంచారం గావిస్తున్న నారదులవారు ఇంద్రలోకం రావడం సంభవించింది. ఆ నారద మునీంద్రుని రాకను గమనించిన ఇంద్రుడు వారికి నమస్కరించి ఇలా అన్నాడు. 'ఓ స్వామీ! మహానుభావా సర్వకాల సర్వావస్థలయందు శ్రీమన్నారాయణునే జపించే మీ వంటి పుణ్యాత్ముడు ఈ సమయంలో నా వద్దకు రావడం నా అదృష్టం, మీకు తెలియనిదేమున్నది. బ్రహ్మ హత్యాపాతకము నన్ను చుట్టుకున్నది. దయ చేసి ఈ పాపనివృత్తి కలిగే ఉపాయము తెలిపి నన్ను అనుగ్రహింపవలసింది అని పరిపరివిధాల వేడుకున్నాడు.

అపుడు నారదులవారు జరిగినదంతయూ గ్రహించి 'ఓయీ! ఇంద్రా! దుఃఖింపవలదు, ఇందులకు ఉపాయము తప్పక గలదు. నీవు మానవ

రూపమున భూలోకములోనున్న వేంకటాద్రికి పోయి కాలినడకన ఆ పర్వతరాజమును అధిరోహించి కొండపై ఆనందనిలయములోనున్న శ్రీమన్నారాయణులవారిని దర్శింపుము. ఈ మార్గమే నీకు శరణం. సాక్షాత్తు వైకుంఠ వాసి అయిన జగన్నాథుడే శ్రీనివాసునిగా సమస్త ప్రాణికోటి చేతనూ ఆరాధింపబడుతున్న దివ్యప్రదేశం వేంకటాద్రి. అంతటి మహోన్నతమైన ఆ వేంకటాద్రిని వీలైనంత త్వరలో యాత్ర సంకల్పించి ఈ పాపము నుంచి బయట పడవలసినది' అని సెలవిచ్చారు. వెంటనే ఇంద్రుడు నారదులవారికి అనేక సపర్యలు గావించి ఎంతో సంతోషపడి మనస్సులో శ్రీమన్నారాయణులవారిని ఇలా ప్రార్థించాడు. 'ఓ జగన్నాథా! శ్రీమన్నారాయణా! నేను తక్షణమే మానవ రూపమున భూలోకము చేరి నీ వేంకటాద్రికి నడిచి ఎక్కి నిన్ను దర్శించుకొనగల వాడను. నన్ను అనుగ్రహింపుము' అని ప్రార్థించెను. నారదులవారు ఇంద్రుని వద్ద శెలవు తీసుకుని తమ త్రిలోక సంచారం కొనసాగించడానికి బయలుదేరారు.

శ్రీమన్నారాయణులవారి అనుగ్రహంతో మానవరూపం పొందిన ఇంద్రుడు కళ్ళు మూసి తెరవగానే వేంకటాద్రి వద్దకు చేరాడు. అలిపిరి మొదటిమెట్టు ముందు నిలిచాడు. ఇంద్రునికి తమిళ బ్రాహ్మణరూపం లభించింది. మనస్సులో శ్రీస్వామి వారికి ప్రార్థించి మొదట మెట్టుపై కాలు పెట్టాడు. అంతే! శరీరమంతా ఒక్కసారి దివ్యతేజస్సుతో వెలిగిపోయింది. కాలు తగలగానే ఏదో అద్భుతశక్తి ఇంద్రునిలో ప్రవేశించినట్లయింది. ఏమిటీ విచిత్రం? ఈ కొండ ఇంతటి మహిమాన్వితమైనదా! ఇంతవరకు ఎప్పుడునూ కూడా ఇంతటి అద్భుత అనుభవానికి లోను కాలేదే? ఆహా! ఎంతటి దివ్యప్రదేశం ఈ తిరుమల? మొదటిమెట్టుపై కాలుపెడితేనే ఇంత అద్భుతంగా ఉంటే ఇక పూర్తిగా కొండ ఎక్కినపుడు ఇంకెంత దివ్యంగా ఉంటుందో కదా! అని తలుస్తూ



ఒక్కొక్క మెట్టు ఎక్కసాగాడు. తనతో పాటు నడుస్తున్న భక్తులను చూసి ఆశ్చర్యపోయాడు. చిన్న పిల్లలు, స్త్రీలు, వృద్ధులు... అనేక భాషలవారూ.. అనేక సాంప్రదాయాలవారు... చిత్ర, విచిత్ర వేషధారణలలో ఉన్నవారు.. అనారోగ్యంతో బాధపడుతూ కూడా ముఖంలో దివ్యానందంతో ఎక్కుతున్నవారు.. చంకలో పిల్లలతో తల్లులు... కొందరు తండ్రులు భుజాలపై పిల్లలను మోస్తూ.. తలపై మూటలు, పెట్టెలతో మరికొందరు.. ఆహా! వీరందరికీ ఆ శ్రీనివాసుడంటే ఎంతటి భక్తియో కదా! వీరి ముఖాలన్నీ ఎంతటి చిరునవ్వుతో వెలిగిపోతున్నాయో గదా! గోవిందా! గోవిందా! గోవిందా! అంటూ ఎంత చక్కగా ఒళ్ళు మరిచి ఎక్కుతున్నారు కదా! .. అంటూ ఇంద్రుడు ఆనందమూ.. ఆశ్చర్యమూ రెండూ కలిగినవాడాయెను.

ఆ విధంగా కొండ ఎక్కుతున్న ఇంద్రుడు చుట్టూ ఎన్నో అద్భుత దృశ్యాలను గమనిస్తున్నాడు. దారి కిరువైపులా ఎంతో మంది మహర్షులు తపస్సు చేసుకుంటూ కనిపించారు. సామాన్యమానవులకు కేవలం వృక్షాలలాగా కనిపిస్తున్న వీరందరూ ఎన్నో కోట్ల సంవత్సరాల నుండీ తపస్సు చేస్తున్నట్లుగా గ్రహించాడు. కాసేపు కూర్చుందామని ఆగాడు. ఇంతలో పక్కనే ఇద్దరు భక్తులు వచ్చి కూర్చున్నారు. వారిలో ఒకరు రెండవ భక్తునితో ఇలా అంటున్నాడు. 'ఇప్పటిదాక ఉన్న అలసటంతా ఒక్కసారి పోయింది. ఈ ప్రదేశంలో మహత్త్యం ఏదో ఉంది. శరీరమంతా ఎంతో తేలికగా అనిపిస్తోంది' అని చెప్తున్నాడు. ఈ భక్తుని అలసట తీరిపోవడానికి కారణం ఆ పక్కనే తపస్సు చేస్తున్న మహా మునీశ్వరుడు ఉండటమే! మానవ మాత్రులైన మనకు వృక్షాల రూపంలో కనపడే మహామునులు ఉండడం చేత తిరుమల గిరులన్నీ మరింత దివ్యంగా ప్రకాశిస్తుంటాయి. ఒక్కోసారి అలసట చెందిన భక్తులు ఏదైనా ప్రదేశంలో

ఆగిన వెంటనే అలసటంతా తగ్గిపోయినట్లు అనిపించి రెట్టించిన ఉత్సాహం వస్తుంది. దీనికి కారణం ఆ పక్కనే ఎంతో తపశ్శక్తి గల మునీశ్వరుడు ఉండటమే అని గ్రహించాలి. కాలినడకన వెళ్ళే ప్రతీ భక్తుడు పాదరక్షలు ధరించకుండా, ఇరు ప్రక్కలా గల వృక్షాలకు నమస్కరిస్తూ, మనస్సులో శ్రీనివాసునే తలుస్తూ నడక కొనసాగించాలి.

స్వామినే ప్రార్థిస్తూ ఎక్కుతున్న ఇంద్రుడికి క్రిందకు దిగుతున్న భక్తులలో ఒక తేజోమూర్తి కనపడ్డాడు. ఇంతటి తేజస్సుతో వెలిగిపోతున్న భక్తుడెవరై ఉంటాడా అని ఒక్క క్షణం ఆలోచించాడు. క్షణంలో ఆ భక్తుడెవరో గ్రహించాడు. అది మరెవరో కాదు. సాక్షాత్తూ వాయుదేవుడే ! ఇంద్రుడు ఆశ్చర్యంతో 'ఓ మహానుభావా! వాయుదేవా! ఏమిటీ విశేషం? సామాన్య మానవ రూపంలో నీవు ఎందుకు కొండ దిగి వెళుతున్నావు? ఈ మహారాష్ట్ర భక్తుని రూపమేమటి? సమస్త ప్రాణికోటికీ ప్రాణాధారుడైన నీవు ఇలా సామాన్య భక్తుని రూపంలో సంచరించడం నాకు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది.' అని కుశల ప్రశ్నలు వేసాడు.

అంతట వాయుదేవుడు 'ఓ! ఇంద్రా ! నీకివే నా నమస్కారములు. ఈ తిరుమల అత్యంత పుణ్యప్రదమైనది. ఈ కొండలలో నా ఉనికి అత్యంత ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా ఉంటుంది. అందుకే శ్రీమన్నారాయణుని భక్తులందరూ ఇక్కడ ఉన్నంతకాలం చల్లని గాలిలో సేద తీరుతారు. ఈ కొండ నడిచి ఎక్కుటలోను, దిగుటలోను ఎన్నో దివ్య రహస్యాలు ఇమిడి ఉన్నాయి. కాలినడకన చేరే భక్తులందరూ తమ, తమ గత జన్మలలో శ్రీస్వామివారిని ఎన్నో విధాల సేవించినవారే! ఎన్నో జన్మలు స్వామిని సేవించినవారికే ఈ కాలినడక భాగ్యం లభిస్తుంది. ఒక్కసారి నడిచి ఎక్కితే వేయి అశ్వమేధయాగఫలం కలుగుతుంది. అదుగో! ఇంద్రా! అక్కడ



చూడు ! ఆ కనపడే కన్నడ భక్తుడు క్రిందట జన్మలో స్వామిని తన గాన మాధుర్యంతో ఎంతో సేవించాడు.. ఆ ఎదురుగా నుంచున్న స్త్రీ భక్తురాలు స్వామిని పూలకైంకర్యంతో ఎంతో సేవించింది.. ఇలా వీరందరూ తమ తమ పూర్వజన్మలలో శ్రీస్వామివారిని ఎన్నో విధాల సేవించిన వారే! అందుకే అత్యంత దయామయుడైన శ్రీస్వామివారు వీరందరికీ ఈ భాగ్యం అనుగ్రహించారు.. ఓ! ఇంద్రా! ఇదుగో ఇప్పుడే మన పక్కనుంచి వెళ్ళిన ఈ భక్తుడు ఈ కొండ 21వ సారి ఎక్కుతున్నాడు! ఇతడు స్వామివారిని ద్వాపరయుగంలో కృష్ణావతారంలో సేవించిన గోపికలలో ఒకడు. ఆ పుణ్యఫలంచేత ఈ జన్మలో ఇన్ని సార్లు ఎక్కే భాగ్యాన్ని శ్రీస్వామి ప్రసాదించారు.. అలాగే ఆ దూరంగా కనపడుతున్న వృద్ధ భక్తుడు ఎవరనుకున్నావు? పూర్వజన్మలో స్వామిని తన దివ్యగానంతో మైమరిపింపచేసిన గాన విదుషీమణి... ఇలా కొండ ఎక్కుతున్న భక్తులందరికీ శ్రీస్వామివారితో తమ తమ పూర్వజన్మలలో ఏదో ఒక దివ్య బంధం కలిగినవారే. అయితే వారిలో చాలామందికి ఈ విశేషం తెలియదు. పూర్వజన్మ సేవా ఫలంతోనే తాము ఈ కొండనెక్కే అదృష్టానికి నోచుకున్నామన్న విషయం భక్తులందరూ గ్రహించాలి' అని వాయుదేవుడు ఇంకా ఇలా చెప్పసాగాడు. 'ఓ! ఇంద్రా! నేను శ్రీస్వామివారి ఆజ్ఞానుసారం ప్రతీ పౌర్ణమినాడూ మానవరూపంలో కాలినడకన ఈ వేంకటాద్రి నడిచి ఎక్కి స్వామిని దర్శించి తిరిగి దిగుతాను. ఇది నాకెంతో ఆనందకరమైనది. సమస్తలోకాలలోనూ వ్యాపించి ఉన్న నాకు ఈ కొండపై గల అద్భుత అనుభూతులూ ఇంక ఎక్కడా కలగవు. ఇంతటి దివ్యానుభూతులకు సాటి గల ప్రదేశం ఈ బ్రహ్మాండంలో ఎక్కడా లేదు' అని చెప్పాడు.

ఇలా మాట్లాడుకుంటున్న ఇంద్ర, వాయుదేవుల చెంతనే ఒక దంపతులు వచ్చి కూర్చున్నారు. వాయుదేవుడు వారితో కుశల ప్రశ్నలు

వేసాడు. ఆ దంపతులు తమది ఆంధ్రదేశంలోని విజయవాడ పట్టణమనీ, తమకు వివాహం జరిగి ఏడు సంవత్సరాలైనప్పటికీ ఇంకా సంతానం కలగలేదనీ చెప్పారు. అప్పుడు ఇంద్రుడు 'మీరేమీ దిగులు పడవద్దు. ఈ స్వామి అత్యంత దయామయుడు. మీకు శ్రీవారి అనుగ్రహం వలన ఒక సంవత్సరంలోనే పండంటి మగపిల్లవాడు జన్మిస్తాడు. అని చెప్పగా ఆ దంపతులిద్దరూ ఎంతో సంతోషించి రెట్టించి ఉత్సాహంతో కొండనెక్కడం సాగించారు'.

వాయుదేవుని వద్ద శెలవు తీసుకుని ఇంద్రుడు కొండనెక్కడం కొనసాగించాడు. దారిలో ప్రకృతి అందాలకు ఎంతో ఆశ్చర్యపోతున్నాడు. పక్కనే చెట్టుపై నెమలిని చూశాడు.. మరో పక్కన ఎంతో ముద్దొస్తున్న కుందేళ్ళు... ఝుం అంటున్న తుమ్మెదలనాదం.. ఇవన్నీ గమనిస్తూ కొండనెక్కుతున్న ఇంద్రునికి ఒక వృద్ధ భక్తుడు కనిపించాడు. తనను చూసి చిరునవ్వు నవ్వడం గమనించిన ఇంద్రుడు, ఆ భక్తుడెవరో, అతని నిజరూపమేమిటో వెంటనే పోల్చుకున్నాడు. ఆ వస్తున్నది ఎవరో కాదు.. సాక్షాత్తూ శ్రీనివాసుడే!... జగన్నాయకుడైన శ్రీమన్నారాయణుడే వృద్ధ భక్తుని రూపంలో కొండ దిగి వస్తున్నాడు.. స్వామిని సమీపించిన ఇంద్రుడు 'స్వామీ! ఆర్తజన రక్షకా! ఆపద్బాంధవా! అనాథరక్షకా! ఏమిటీ విచిత్రం! సాక్షాత్తూ నీవే నడుస్తున్నావా! ఏమిటీ విచిత్రం స్వామి?' అని స్వామికి అనేక నమస్కారాలు గావించాడు. అపుడు వృద్ధభక్తుని రూపంలో ఉన్న స్వామివారు చిరునవ్వుతో 'ఓయీ! ఇంద్రా! నాకు నా భక్తులన్న అమిత ప్రేమయని నీకు తెలిసినదే గదా! ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నన్ను దర్శించి వచ్చే ఈ భక్తులతో కలిసి కొండనెక్కడం నాకెంతో ఆనందం. వీరి మంచి చెడూ గమనిస్తూ వీరందరికీ అన్ని భాగ్యాలూ అనుగ్రహించడం నాకు ఆనందం. అందుకే అనేక రూపాలలో నేను ఈ కొండపై



సంచరిస్తుంటాను. ఇంతకుముందే నీ తలపైనుంచి వెళ్ళిన చిలుకల జంట ఎవరనుకున్నావు? నేనూ, నా ఇష్ట సఖి శ్రీ మహాలక్ష్మియే... మేమిరువురమూ ప్రతీరోజూ అనేక రూపాలలో ఈ కొండతటా సంచరిస్తూ ఆనందిస్తుంటాము' అని చెప్తుండగా వెంటనే శ్రీ స్వామి వారి పక్కనే శ్రీమహాలక్ష్మీదేవి కూడా వృద్ధ భక్తురాలిరూపంలో ప్రత్యక్షమైనది. ఇంద్రుడు వెంటనే రెండు చేతులతో నమస్కరించి ఆ తల్లిని ఎన్నో విధాల కీర్తించాడు.

ఇంద్రుడు వారితో 'శ్రీ లక్ష్మీనారాయణులారా! మీరెంతటి భక్తాధీనులు! మిమ్ములను కొలిచేవారి భాగ్యమే భాగ్యము. మీవంటి వారుండగా ఈ భక్తులకు కావలిసినదేమున్నది? అని అన్నాడు. అపుడు శ్రీనివాసుడు, శ్రీమహాలక్ష్మి ఇంద్రునితో 'మాకు ఇరువురికీ ఈ భక్తులందరూ ఆప్తులు, ఈ కొండ నడిచి ఎక్కుతున్న వీరందరూ గత జన్మలలో మా మిత్రగణం లోనివారే. అనేక కారణాలచేత మానవ జన్మలు పొందిన వీరందరూ పూర్వ జన్మ వాసనల చేత తిరిగి మా అనుగ్రహం కోసం ఈ కొండను కాలినడకన ఎక్కి మమ్ముల దర్శించవస్తున్నారు.' అని అంతర్ధానమైనారు.

ఇంద్రులవారు శ్రీలక్ష్మీనారాయణులకు మరొక్కమారు నమస్కరించి నడక కొనసాగించాడు. వేంకటాద్రి దివ్య వైభవాన్ని గ్రహించిన ఇంద్రునికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. ఇంతట దివ్యగిరులు ఈ విశ్వంలో మరెక్కడా లేవని తెలుసుకున్నాడు. సర్వదేవతా గణమూ ఈ వేంకటాద్రిమీద విహరిస్తున్నారంటే ఇది ఎంతటి అద్భుత ప్రదేశమో గదా! ఇలా తలుస్తూ నడుస్తున్న ఇంద్రునికి పక్కనే చెట్టుమీద చిలుకల జంట కనిపించింది. ఆహా! ఎంత అద్భుతంగా ఉన్నాయి ఈ చిలుకలు అని తలిచాడు. ఒక్కసారి కనులు మూసుకుని ధ్యానం చేసిన ఇంద్రునికి ఆ చిలుకల పూర్వజన్మ

వృత్తాంతం గోచరించింది. ఈ చిలుకల జంట క్రిందట జన్మలో తిరుమలలో స్వామి సేవకులు. స్వామివారిమీద ఎంతో భక్తి ఉన్నప్పటికీ ఒక చిన్న పొరపాటుచేత ఆ విధంగా తిరిగి జన్మ ఎత్తటం జరిగింది. స్వామివారి అనుగ్రహంచేత పక్షి జన్మ వచ్చినందుకే తిరుమలలోనే ఉండే భాగ్యం కలిగింది. ఈ జంట ఇలా ఇక్కడే కొండ ఎక్కే మెట్ల దారిలో విహరిస్తూ శ్రీవారి దర్శనం కోసం వెళుతున్న భక్తులను చూస్తూ ఆనందిస్తుంటారు.

ఇలా ఆలోచిస్తూ నడుస్తున్న ఇంద్రునికి కొంతదూరం వెళ్ళగానే ఒక్కసారిగా వాతావరణమంతా చల్లబడుతున్నట్లు అనిపించింది. కొద్దిగా సన్నని తుంపరలు ప్రారంభమయ్యాయి. చల్లని చిరుగాలికి ఆనందిస్తున్న ఇంద్రునికి ప్రక్కనే మానవ రూపంలో వచ్చిన వరుణుడు కనిపించాడు. ‘ఓ! వరుణదేవా! నీవునూ ఇచ్చటనే ఉన్నావా? ఎంతటి ఆనందం! అని అన్నాడు. ‘ఓయీ! ఇంద్రా! ఈ భూమండలంలోని వేంకటాద్రి నాకు అత్యంత ప్రియమయిన ప్రదేశం. ఎల్లవేళలయందు శ్రీమన్నారాయణుల వారు నివసిస్తున్న ఈ వేంకటాద్రి యందు సంచరించడం నాకెంతో ప్రియం. అందుకే సంవత్సరమంతయూ కూడా ఋతువులతో సంబంధం లేకుండా ఇక్కడ చల్లటి తుంపరలను కురిపిస్తుంటాను. ఎల్లవేళలా ఈ కొండపై ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ విశ్వంలో వేంకటాద్రికి మించిన దివ్య ప్రదేశం మరొకటి లేదు. ఇప్పటివరకు కొన్ని లక్షలసార్లు ఈ పవిత్ర ప్రదేశంలో మహామునీశ్వరులచేతనూ, సర్వదేవతా గణం చేతను యజ్ఞాలు చేయబడ్డాయి. ఇన్నిసార్లు యజ్ఞ, యాగాదులు చేయబడిన పవిత్ర ప్రదేశం ఈ భూమండలంలో మరెక్కడా లేదు. ఈ యజ్ఞాలన్నీ కూడా ఎంతో అద్భుత మంత్రశక్తి, వేదశాస్త్ర పాండిత్యము గల



మహనీయులచే కావించబడ్డాయి. వీటన్నింటి ఫలం వలననే ఈ వేంకటాద్రి మరింత దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నది.’ అని వివరించాడు.

అపుడు ఇంద్రుడు వరుణునితో ‘ఓయీ! వరుణదేవా! ఈ వేంకటాద్రి వైభవము వింటున్న కొద్దీ మరల మరలా వినాలనిపిస్తున్నది. ఇంకా వివరించి చెప్పవలసినది’ అని కోరగా వరుణుడు ఈ విధంగా చెప్పుతున్నాడు. ఓ! ఇంద్రా! ఇంతకు ముందు నేను చెప్పినట్లుగా ఈ తిరుమల విశిష్టత పూర్తిగా వర్ణించడం ఎవరి తరమూ కాదు. నాకు వీలైనంతలో నేను వర్ణిస్తాను. సమస్త దేవతలూ వీలైనపుడల్లా మానవ రూపాలలో ఈ కొండపై సంచరిస్తుంటారు. శ్రీనివాసుని దర్శనార్థమై వచ్చిన భక్తుల మధ్య వారు కూడా సామాన్య భక్తులవలెనే తిరుగుతూ వారి సాధక బాధకాలు విని, వారికి కావల్సిన సదుపాయాలన్నీ సమకూరుస్తారు. స్వామివారి భక్తులను సేవించడం ద్వారా స్వామి అనుగ్రహానికి పాత్రులవుతారని వారి విశ్వాసం. ఈ కొండపై బ్రహ్మాది దేవతలు ఇప్పటివరకు ఎన్నో ఉత్సవాలు ఎంతో అద్భుతంగా నిర్వహించారు. ఈ తిరుమల విశేషాలు ఇన్నీ, అన్నీ కాదు. మానవులు ఏ కొండపైకయినా ఎక్కేటప్పుడు శరీరశక్తి తగ్గుతుంటుంది. కానీ ఈ వేంకటాద్రి ఎక్కుతున్నపుడు మాత్రం ఎక్కుతున్న కొద్దీ వారిలో శక్తి పెరుగుతుంది. ఇంకా ఇంకా ఉత్సాహం ఇనుమడిస్తుంది. ‘ఓ! ఇంద్రా! నీకిప్పుడు కేశవరాయుడనే భక్తుని కథ వివరిస్తాను. ఈ కథను విన్న నీకు శ్రీమన్నారాయణునికి భక్తుల ఎడల ఎంత ప్రేమయో అర్థం కాగలదు.’ అని చెప్పి వరుణుడు ఈవిధంగా వివరించసాగాడు.

పూర్వకాలంలో వంగదేశంలో కేశవరాయుడనే విష్ణుభక్తుడు నివసించేవాడు. శ్రీమన్నారాయణుడే సర్వస్వంగా భావించి ఎల్లప్పుడూ ఆ స్వామినే స్మరిస్తుండేవాడు. వీలున్నపుడల్లా వేంకటాద్రికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకుంటుండేవాడు. కేశవరాయునికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వివాహం జరిగి రెండు సంవత్సరాలు కావస్తున్నది. ఇక రెండవ కుమార్తె వివాహం చెయ్యాలని ఆలోచనలో ఉండగా అదృష్టం కొద్దీ తెలిసిన వారిలోనే ఒక కుర్రవాడు వివాహమాడతానని ముందుకు వచ్చాడు. ఇదంతా శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదని తలచిన కేశవరాయుడు పెళ్ళి పనులు మొదలుపెట్టి ముందు ఒకసారి తిరుమల వెళ్ళి స్వామి దర్శనం చేసుకుందామని తలచాడు.

ఇంతలో ఒక చిన్న సంఘటన జరిగింది. కేశవరాయుడు అనుకోనివిధంగా వాన నీటిలో జారిపడి కాలు కొద్దిగా విరిగింది. ఆ నొప్పితో విలవిలలాడుతూ ‘స్వామి ! ఏమిటీ వైపరీత్యం ! ఏ పాపం చేశానని నాకీ శిక్ష? నిన్ను దర్శించాలనే తలంపుతో ఎంతో ఉత్సాహంగా ఉన్నానే! నాకెందుకీ విధంగా జరిగింది? దయచేసి త్వరగా ఈ నొప్పినుంచి కోలుకుని నీ దర్శనానికి రాగలిగేలా అనుగ్రహించవలసింది అని వేడుకున్నాడు. ఎంతటి వారికైనా పూర్వజన్మ కర్మ అనుభవించక తప్పదు గదా! ఎంతటి మహాత్ములూ కూడా పూర్వజన్మ కర్మను తప్పించుకోలేరు. అదీ కూడా ఏ జన్మఫలం ఎప్పుడు అనుభవంలోకి వస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. క్రిందట జన్మలో ఎంతో పుణ్యాత్ముడైనప్పటికీ ఈ జన్మలో అనేక కష్టాలను అనుభవించరావచ్చు. ఎందుకంటే ఎప్పుడో నూరు జన్మల క్రిందట పాపఫలం ఇప్పుడు అనుభవానికి రావచ్చును. ఏ జన్మకర్మ ఎప్పుడు అనుభవానికి వస్తుందో ఆ పరమాత్మకే ఎరుక.



అందుకే కేశవరాయుని విషయంలో కూడా ఇదే జరిగింది. ఈ జన్మలో ఎన్నో పుణ్యకార్యాలను చేసి ఉన్నప్పటికీ కూడా ఎప్పుడో చేసిన పూర్వజన్మ పాప కర్మఫలితంగా ఇప్పుడు ఈ కష్టం అనుభవించవలసి వచ్చింది. అందరూ ప్రయాణాన్ని వాయిదా వేసుకొనవలసిందిగా కోరారు. కానీ అతడు అందుకు సమ్మతించలేదు. ఎంతటి కష్టం రానీ ప్రయాణం ఆపుకోనని అన్నాడు. స్వామి అత్యంత దయామయుడు కదా! వెంటనే తన భక్తుడైన కేశవరాయునికి నొప్పి ఉపశమించేలా అనుగ్రహించాడు. స్వామి అనుగ్రహంతో రెండు రోజులలోనే బాధ తగ్గి భార్య పిల్లలు తోడు రాగా ప్రయాణం మొదలుపెట్టాడు.

అలిపిరి చేరిన కేశవరాయుడు ఒక్కో మెట్టు అతి కష్టంమీద ఎక్కసాగాడు. శరీరమంతా బాధతో తోసేస్తున్నట్లుగా అనిపిస్తోంది. నొప్పి చాలామటుకు తగ్గినా కొండ ఎక్కుతున్నందువలన రెండు కాళ్ళు చాలా నొప్పిగా అనిపిస్తున్నాయి. ఇతని బాధనంతా గమనిస్తున్న జగన్మాత అలర్‌మేల్ మంగమ్మ విభునితో భక్తుని ఆదుకొనవలసిందిగా వేడుకున్నది. వెంటనే ఒక విచిత్రం జరిగింది. మరో మెట్టు ఎక్కుతున్న కేశవరాయుడు తుళ్ళిపడి దాదాపు ఇరవై మెట్లు క్రింద పడ్డాడు. భార్య, పిల్లలు ఈ విపరీతానికి ఎంతో దుఃఖించి ఇంక ముందుకు ఎలా సాగటమా అని సందిగ్ధంలో పడ్డారు. అయితే ఇంతలోనే ఒక అద్భుతం గమనించారు. క్రిందపడిన కేశవరాయుడు తనంతట తానే లేచి ఒళ్ళు దులుపుకుని చిరునవ్వుతో మెట్లెక్క సాగాడు. శరీరమంతా నూతన తేజస్సుతో ప్రకాశించింది. శ్రీ స్వామివారిని ఆ కుటుంబం అంతా అనేక విధాల స్తుతించి సంతోషంతో కొండ ఎక్కి స్వామిదర్శనం చేసుకున్నారు. అని వరుణుడు కేశవరాయుని కథ చెప్పాడు.

స్వామి అనుగ్రహంతో కేశవరాయుడు నడుస్తున్న మెట్ల పక్కనే వృక్ష రూపంలో కృతయుగం నుంచీ తపస్సు చేస్తున్న మహర్షి తన శక్తిని కొంచెం కేశవరాయునిపై ప్రసరింపచేసాడు. ఒక్కసారిగా వచ్చిన ఆ శక్తిని తట్టుకోలేక క్రిందపడిన కేశవరాయుడు ఆ దివ్యశక్తి ప్రభావంతో సంపూర్ణ ఆరోగ్యం పొందాడు. తిరుమల కొండ ఎక్కుతున్న భక్తులకు ఇటువంటి శ్రీ స్వామి వారి లీలలు ఎన్నో అనుభవానికి వస్తాయి.

శ్రీమన్నారాయణుని దివ్యగాధలు తలచుకుంటూ కొండ ఎక్కుతున్న ఇంద్రుడు, వరుణ దేవులకు కొంత దూరం వెళ్ళేసరికి పక్కనే ఒక చెట్టు నీడన మానవరుపాలలో కూర్చుని మాట్లాడుకుంటున్న నలుగురు మహర్షులు కనపబడ్డారు. వెంటనే వీరు కూడా వారి చెంతకు చేరి మహర్షులకు నమస్కారం చేశారు.

కుశల ప్రశ్నల అనంతరం మహర్షులలో ఒకరు 'ఓ దిక్పాలకులారా! మీ రాక ఎంతో సంతోషము. శ్రీమన్నారాయణుని దర్శనార్థమై వెళుతున్న మిమ్ములను చూచి మాకు ఎంతో ఆనందము కలిగినది. పూర్వము త్రేతాయుగములో శ్రీరామచంద్రులవారు సీతాసమేతంగా ఈ కొండను ఎక్కి శ్రీ స్వామివారిని దర్శించారు. వారి రాక సమయంలో బ్రహ్మాది దేవతలందరూ వచ్చి అద్భుతమైన ఉత్సవములను ఒక మాసం కాలంపాటు నిర్వహించారు. బ్రహ్మాండమైన యజ్ఞం నిర్వహించబడింది. ఈ వేంకటాద్రి అతి పవిత్రమైనది. కలియుగంలో మానవులకు ఈ వేంకటాచల యాత్రను మించిన భాగ్యము మరొకటి లేదు. ఒక్కసారి యాత్ర చేసి స్వామిని దర్శిస్తే సర్వ పాపాలూ తొలగిపోయి, అష్టైశ్వరములూ లభించగలవు. వయోభారము చేతగానీ, అనారోగ్యము చేతగానీ యాత్ర చేయలేనివారు కేవలం మనస్సులోనే వేంకటాద్రిని తలచుకుని, నమస్కరించి



శ్రీమన్నారాయణుని మనస్సులోనే స్తుతించిన మాత్రముననే ఈ యాత్ర చేసినంత ఫలము లభించగలదు. ఈ కొండలన్నీ సర్వకాల సర్వావస్థలయందును ఓంకార నాదముతో ప్రతిధ్వనిస్తున్నవి. జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణుడు నిత్యం నివసిస్తున్న పుణ్యప్రదేశం కావడం చేత ఈ వేంకటాద్రి నామం తలచినంతనే కోటి జన్మల పాపాలన్నీ నశిస్తాయి. ఓ ఇంద్ర, వరుణులారా ఈ రోజు ఇలా మానవ రూపంలో ఈ కొండ ఎక్కుతున్న మీరు ధన్యులు' అని మహర్షి అనిన వెంటనే ఇంద్ర, వరుణులిద్దరూ ఎంతో ఆనందపడి ఆ మహర్షులందరికీ నమస్కరించి తిరిగి తమనడక కొనసాగించారు.

శ్రీనివాసుని దర్శనార్థమై కొండ నెక్కుతున్న భక్తులలో తామూ కలిసిపోయి వారి వారి విశేషాలను తెలుసుకుంటూ నడుస్తున్నారు. ఎల్లవేళలా శ్రీమన్నారాయణుని గురించే తలచేవారికి ఎటువంటి ఆపదలు కలుగవు. వారు తలపెట్టే ఏ సత్కార్యమైనా నిర్విఘ్నంగా కొనసాగుతుంది. సర్వ సౌభాగ్యాలూ వారికి ఒనగూరుతాయి. ఎల్లప్పుడూ శ్రీనివాసుని గుణ గణాలను గానం చేసేవారికి మరు జన్మ ఉండదు. సాధారణంగా భక్తులు మూడు విధాలుగా ఉంటారు. ఎవరైతే శ్రీమన్నారాయణుని తనలోనూ, సర్వభూతాలలోను దర్శిస్తూ, భగవంతునిలోనూ, తనలోనూ సర్వ భూతాలనూ దర్శించేవాడు ఉత్తమ భాగవతోత్తముడని పేర్కొనబడ్డాడు. అలాగే భగవంతుని మీద ప్రేమ, భక్తులతో మైత్రి, అజ్ఞానులపట్ల దయ, భగవంతుని విరోధులపట్ల ఉపేక్షాభావం కలిగి ఉండేవాడు మధ్యమ భక్తుడు. శ్రీమన్నారాయణుని యొక్క అర్చారూపాన్ని మాత్రమే శ్రద్ధగా పూజిస్తూ, స్వామి వారి భక్తులను గానీ, ఇతరులనుగానీ లక్ష్యపెట్టనివాడు సాధారణ భక్తుడు.

ఇంద్రియ భోగాలను, లౌకిక సుఖాలను అనుభవిస్తున్నప్పటికీ వాటిమీద ఆసక్తిగానీ, ద్వేషంగానీ లేకుండా నిరాసక్తంగా ఉండి, ఈ విశ్వమంతా విష్ణుమాయేనని తలచేవాడు ఉత్తమ భక్తుడు.

మానవులందరూ ఎల్లప్పుడూ సుఖాల కోసం అనేక కర్మలు చేస్తూ, మృత్యువుకు కారణమైనదీ, దుఃఖాన్ని కలిగించేది అయిన ధనార్జనపై విపరీతమైన వ్యామోహం పెంచుకుని ఇల్లు, పిల్లలు, సంసారం అనే ఊబిలో చిక్కుకుపోతారు. తాము చేసిన పుణ్య, పాపకర్మల ఫలితాన్ని అనుభవిస్తూ ఇతరులమీద అసూయ, ద్వేషాలు పెంచుకుంటారు. వీరందరూ విష్ణుమాయలో పడి కొట్టుకుపోతుంటారు. సర్వత్రా ఆత్మరూపంలో శ్రీమన్నారాయణుడే ఉన్నాడని గ్రహించేవారు, ఎటువంటి ప్రాపంచిక వాసనలు అంటకుండా కర్మలను అనుభవిస్తూ సర్వకాల సర్వావస్థలయందు శ్రీమన్నారాయణునే స్మరించేవారు ఈ మాయని అధిగమించి అంత్యమున విష్ణుసాయుజ్యము పొందగలరు.

సమస్త ప్రాణికోటి శరీరాలను ఉపాధులుగా (ఆశ్రయాలుగా) స్వీకరించిన పరమాత్మకు ఆ శరీరాలలో జరిగే మార్పులతో, వారు చేసే కర్మలతోగానీ సంబంధంలేదు. ఆ పరమాత్మ కేవలం సాక్షీభూతంగానే నిలుస్తాడు. వీనికి ఆద్యంతములు లేవు. వృద్ధి క్షయాలు లేవు. ఈ విశ్వంలో నిత్యమైనదీ, సత్యమైనదీ ఆ పరబ్రహ్మం ఒక్కటే. అటువంటి పరబ్రహ్మమూర్తి అయిన శ్రీమన్నారాయణుని పాదాలను సేవించే వారికి జన్మ జన్మల కర్మఫలాలన్నీ నశించి ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది.

శ్రీమన్నారాయణుని గుణగణాలను కీర్తిస్తూ ఇంద్రుడు, వరుణుడు కొండ ఎక్కసాగారు. అప్పుడు వరుణుడు ఇంద్రునితో 'ఓ! ఇంద్రా! ఈ



విశ్వంలో అతి పవిత్రమైన ఈ కొండ అనేక నామములతో పిలవబడు తున్నది. ఈ కొండ ఎక్కినంతనే కోరిన కోరికలు సిద్ధించుట చేత చింతామణి అని, జ్ఞానమును అందించునది యగుటచే జ్ఞానాద్రి అనీ, సర్వతీర్థమయమూ అగుటచే తీర్థాద్రి అనియూ, ఎన్నో దివ్య పుష్కరములకు నిలయమై నందువలన పుష్కరాద్రి అనియూ పిలవబడుచున్నది. ఇంకనూ ధర్మ స్వరూపము అగుటచే వృషాద్రి అనియు, స్వర్ణమయము అగుటచేత కనకాద్రి అనియూ, వైకుంఠము నుండి తేబడినది గావున వైకుంఠాద్రి అనీ, హిరణ్యాక్షవధకొరకు శ్రీమన్నారాయణుడు నరసింహరూపమును ధరించిన ప్రదేశము గావున సింహాచలమనీ, హనుమంతుడు జన్మించిన ప్రదేశ మగుటచే అంజనాద్రి అనియూ, నీలుడనే నామం గల వానరోత్తముడు నివసించుటచే నీలాద్రి అనియూ, భక్తులకు ఆనందము కలుగచేయును గనుక ఆనందాద్రి అనియూ, లక్ష్మీదేవి నివాసము కావున శ్రీశైలమనియూ, శ్రీనివాసుడుండే ప్రదేశముగావున శ్రీనివాసగిరి అనియూ, అమృత ఐశ్వర్యములకు నిలయము గావున వేంకటాద్రియనియూ పిలవబడుచున్నది. ఇంతటి మహోన్నతమైనది గావున వేంకటాద్రి నామమును తలచినా కూడా సర్వ పాపములు హరింపగలవు. అని వేంకటాద్రి వైభవమును అనేక విధాలుగా వర్ణించాడు.

అత్యంత పవిత్రమైన ఈ కొండను నడిచి ఎక్కడానికి ప్రత్యేక సమయమంటూ ఏదీలేదు. ఎప్పుడైనా, తిథి, వార, నక్షత్రాలకు సంబంధం లేకుండా ఎక్కవచ్చును. కానీ కొన్ని ప్రత్యేక దినాలలో ఎక్కినచో ఫలం అధికంగా ఉండగలదు. ఏకాదశి, పౌర్ణమి, రోజులలో ఈ కొండ ఎక్కితే ఎంతో పుణ్యప్రదం. వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాలలో ఎక్కినా కూడా చాలా మంచిది.

పూర్వకాలమున ఒకానొక రోజున వేంకటాచార్యులు అనే వృద్ధ వైష్ణవ భక్తుడు శ్రీనివాసుని దర్శనార్థమై తిరుమల యాత్ర సకంల్పించి అలిపిరి చేరి నెమ్మదిగా కొండ నెక్కసాగాడు. తన చంకలో ఒక పెద్ద మూట పెట్టుకుని నెమ్మదిగా రొప్పుతూ, రొప్పుతూ ఎక్కుతున్నాడు. అలసట తెలీకుండా ఉండడానికి గోవింద నామ స్మరణ చేస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కసాగాడు. అసలే వయోభారం. ఆపై అనారోగ్యం, ఇక అన్నింటికీ మించి ఈ మూట. ఈ మూటను మోస్తూ కొండ ఎక్కడం అతికష్టంగా ఉంది. ఆ శ్రీమన్నారాయణునే ప్రార్థిస్తూ ఎక్కసాగాడు. ఇంతలో ఎక్కడనుంచి వచ్చాడో ఒక బాలుడు వేగంగా తన వెనకే మెట్లెక్కి వచ్చి తాతా! ఎందుకు నీకీ భారం! నేను మోస్తాను ఇవ్వు!' అన్నాడు. కానీ వేంకటాచార్యులకు ఇవ్వ బుద్ధి కాలేదు. ఈ మూట పుచ్చుకుని ఒక్క క్షణం పరుగెత్తి మాయమవుతే నా గతేం కాను? నా నిత్య పూజా సామాగ్రి, బట్టలు అన్నీ దీంట్లోనే ఉన్నాయి గదా! అని సంకోచిస్తూ ససేమిరా ఇవ్వనని చెప్పాడు. అందుకు ఆ బాలుడు ఒప్పుకోలేదు. 'తాతా! ఎందుకు అలా కష్టపడతావు చెప్పు! నాకివ్వు. నీ భయమంతా నేను ఈ మూట తీసుకుని దొంగిలించు కుపోతాననే గదా. 'నేనట్లా అస్సలు చెయ్యను. నీ పక్కనే నడుస్తాను. నీ తోటే ఉంటాను. సరేనా! అని అన్నాడు. అప్పుడు ఆచార్యుల వారికి ఏం చెప్పాలో తోచలేదు. ఏదో ఆలోచించి ఆ బాలునితో 'నాయనా! నువ్వు చాలా చిన్నవాడివి. ఇంతటి బరువు మూట మొయ్యటం నీ సాధ్యం కాదు. అని అన్నాడు. అప్పుడు ఆ బాలుడు చిరునవ్వుతో "తాతా! ఏమి ఆలోచించకండి. ఈ బరువు నాకొక లెక్క కాదు. ఎంతటి బరువునైనా ఇట్టే మొయ్యగలను. కావాలంటే ఈ కొండ మొత్తాన్నే మొయ్యగలను. ఈ మూట ఎంత పాటిది? అన్నాడు. అప్పుడు ఆ తాతకి



ఇంక మూట ఇవ్వక తప్పలేదు. మరో మాట ఆలోచించక మూటను ఆ బాలుడి చేతిలో పెట్టాడు. వేంకటాచార్యులకి బాలుడి స్పర్శ తనకు తగలగానే తన కేదో దివ్యమైన శక్తి వచ్చినట్లు తోచింది. అలసట అంతా క్షణంలో మాయమయ్యింది. అంతటి శక్తి వచ్చిన వాడైన ఆచార్యులవారికి ఇంకేం! ఈ శక్తితో ఆ మూట చక్కగా తనే మొయ్యగలడు. తిరిగి తీసుకుంటేనో? అని తలచాడు. మళ్ళీ ఆ బాలుడు ఇలా అడిగితే ఏమనుకుంటాడో అని తలచి ఆ ఆలోచన విరమించుకున్నాడు.

ఇంతలో ఒక భక్తుల గుంపు భజనలు పాడుకుంటూ ఎక్కుతున్నారు. వేంకటాచార్యులవారు కూడా వారితో కలిసిపోయారు. ఆ బాలుడు కూడా వారితోనే ఉన్నాడు. ఎంతో చక్కగా భజనలు చేస్తున్న వారందిరినీ చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నాడు. ఆచార్యులవారూ కూడా ఎంతో ఉత్సాహంగా తను కూడా భజన చేస్తూ వారితో నడవసాగారు. ఆ ఆనందంలో వారు ఆ బాలుని సంగతే మర్చిపోయారు. ఇలా ఒక గంట గడిచింది. ఇంతలో ఆ భజన బృందం వారంతా ఒక ప్రక్కనే ఆగి తమతో తెచ్చుకున్న ఆహార పదార్థాలు తినడానికి ఉపక్రమించారు. వారిలో ఒకరు 'తాతా! నువ్వు కూడా మాతో కలిసి భుజింపవలసింది. ఇంక నడవవలసిన దూరం చాలా ఉన్నది' అని అన్నారు.

అప్పుడే క్షణంలో ఆచార్యులవారికి ఆ బాలుడి సంగతి గుర్తొచ్చింది. అటూ ఇటూ చూశాడు. ఎక్కడా లేదు. తను అనుకున్నంతా అయింది. ఆ బాలుడు తన బట్టలతో ఉడాయించాడు. ఇంక నా గతేం కాను? అని బాధపడసాగాడు. ఇదే సంగతి ఆ భజన బృందానికి చెప్పాడు. ఆ బృందంవారు 'తాతా! నువ్వు ఎవరి సంగతి చెప్తున్నావో మాకు అర్థం

కావటల్లేదు. మీరు కూడా మాతో కలిసి గంటపైగానే ఆడితిరి గదా! గంటనుంచి మనమందరం కలిసే నడుస్తున్నాం. కానీ మీరు చెప్తున్న బాలుడెవరో తెలీదు. మాలో ఎవరమూ ఆ బాలుణ్ణి చూడలేదు' అని అన్నారు. అప్పుడు ఆచార్యులవారు 'నాయనలారా! ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆ బాలుడు ఈ క్షణం వరకూ నాతోనే ఉన్నాడు. కాదు! కాదు! మనతోనే ఉన్నాడు. మీరెవ్వరూ గమనించలేదనడం ఆశ్చర్యంగా ఉంది. మీ అందరి మధ్యనా చిరునవ్వుతో నా మూటను భుజాన పెట్టుకుని వయ్యారంగా గెంతుతూ నడుస్తున్నాడు. మీ పాటలన్నీ వింటూ ఎంతో ఆనందిస్తూ తనూ కొన్ని పాటలు పాడాడు. బహుశా ఆ పాటలో తన్మయత్వంలో పడిన మీరు ఆ బాలుని గమనించి ఉండరు. ఏది ఏమైనప్పటికీ నా కట్టుబట్టలన్నీ దాంట్లోనే ఉన్నాయి. నిత్య పూజా సామాగ్రి మొత్తం దాంట్లోనే ఉన్నాయి. ఏమైనాయో ఏమో!' అన్నాడు.

అప్పుడా భక్త బృందంవారు 'స్వామీ! మీరు చింతించకండి. ఆ బాలుడిని వెతికే పూచి మాది. ప్రస్తుతం మాతో కలిసి భోజనం చెయ్యండి. లేకపోతే ఈ ఎండవేళలో నీరసం రాగలదు. కాసేపు ఆ బాలుడి సంగతి మర్చిపోండి. మనమందరం కలిసే కొండ ఎక్కుదాం. కొండ ఎక్కగానే అన్ని సత్రాలలోనూ మీరు చెప్తున్న బాలునికై మేమే గాలించి ఎట్లాగైనా ఆ బాలుణ్ణి వెతికి పట్టుకుంటాము. స్వామివారి దర్శనానికంటే ముందు మీ పనే చేస్తాము.' అని ఆచార్యులవారిని అర్థించగా చివరికి ఒప్పుకోక తప్పింది గాదు. ఏదో పరధ్యానం గానే భోజనం కావించారు ఆచార్యులవారు. కాసేపు విశ్రమించిన తరువాత అందరూ కలిసి తిరిగి నడక ప్రారంభించారు. మళ్ళీ భజనలు ప్రారంభించారు. ఎంతో శ్రావ్యంగా ఉన్న ఆ కీర్తనలు



వింటున్నారన్నమాటే గానీ ఆచార్యులవారికి మనస్సంతా తన మూట మీదే ఉంది. ఏమయ్యా! శ్రీనివాసా! ఏమిటీ పరీక్ష! నా మూటను పట్టుకున్న బాలుణ్ణి నువ్వే పట్టియ్యాలి తండ్రీ! అని వేడుకుంటూ కొండ ఎక్కసాగాడు. మరో రెండు గంటలు అలా భక్త బృందంతో కలిసి ఎక్కాడు. దాదాపు కొండ పైకి చేరారు. ఇంతలో ఒక చిన్న మలుపు వచ్చింది. భక్త బృందమంతా మలుపు తిరిగి తనొక్కడే ఇంక మిగిలి ఉన్నాడు. అంతే! తన ఎదురుగా ఎక్కడి నుంచి వచ్చాడో ఆ బాలుడు ప్రత్యక్షం! తన మూటతో సహా! 'ఎక్కడికి పోయావయ్యా ఇప్పటిదాకా!' అని ఆ బాలుణ్ణి గట్టిగా కసురుకున్నాడు. ఆ బాలుడు చిరునవ్వుతో నేను ఎక్కడికీ పోలేదు తాతా! నీ వెంటనే ఉన్నాను.' అన్నాడు. 'అదుగో! అలా అబద్ధం చెప్పకు. ఇంత మందిమి ఉన్నాము. ఎవ్వరికీ నువ్వు కనపడలేదు. ఏదైతేనేమిలే! నా మూట నాకు దొరికింది. ఇంతకీ నీ పేరేమిటి నాయనా!' అన్నాడు. 'తాతా! నా పేరా! నీ ఇష్టం, ఈ సృష్టిలో ఉన్న పేర్లన్నీ నావే! నువ్వు ఎలా పిలిచినా పలుకుతాను. అని నవ్వుతూ మలుపులో రివ్వున పరుగెత్తాడు. ఆచార్యులవారు ఈ పిల్లాడు చాలా విచిత్రంగా ఉన్నాడే! పేరు కూడా చెప్పడే! అని తలుస్తూ, మలుపు తిరగగానే కనపడుతాడుగా అప్పుడు మళ్ళీ అడుగుదామని తలచాడు. మలుపు తిరిగేసరికల్లా బాలుడు కనపడలేదు. కొంచెం దూరంలో భక్త బృందం ఆగి ఉన్నారు. అంతే! వెంటనే ఆచార్యులవారికి జరిగినది అర్థమైనది. ఆ బాలుడు శ్రీనివాసుడేనని గ్రహించాడు. కళ్ళనీళ్ళతో 'ఓ స్వామి! ఆర్త జనరక్షకా! జగన్నాథా! వచ్చినది నీవేనని గ్రహించలేకపోతినే! నీకు ఏమీ సపర్యలు చేయలేదు సరిగదా నిన్ను ఈసడించుకున్నాను. నన్ను క్షమించు తండ్రీ ! అని మనస్సులో

పరి పరివిధాల స్వామిని ప్రార్థించాడు. భక్త బృందం వారితో జరిగినదంతా చెప్పాడు. వారి ఆనందానికి అంతు లేదు. సాక్షాత్తూ ఆ స్వామి వారే మనందరితో నడిచాడన్నమాట! ఎంతటి అదృష్టం. సాక్షాత్తూ ఆ స్వామి దర్శనం అయిన ఆచార్యులవారు ఎంతటి అదృష్ట వంతులు అని తలుస్తూ ఆ స్వామిని పరిపరివిధాల స్తుతించారు.

శ్రీనివాసునికి భక్తులంటే అలవిమాలిన ప్రేమ. కొండనెక్కే భక్తులందరితోనూ అనేక రూపాలతో తిరుగుతూ వారందరికీ ఎన్నో రకాలుగా సహాయం చేస్తాడు. తన దర్శనానికి వచ్చే తన వారందరికోసం ఎంతో తపిస్తాడు. త్వరితగతిన దర్శనం కలిగేలా తనే చూస్తాడు. దర్శన ఏర్పాట్లను అపరిచిత భక్తుల రూపంలో తిరుగుతూ తనే పర్యవేక్షిస్తాడు. ప్రత్యేకించి కాలినడకన వచ్చే భక్తులంటే మిక్కిలి ప్రేమ. వారికి శ్రమ తెలీకుండా వారితో పాటే నడుస్తూ ఎన్నో విశేషాలను చెప్తుంటాడు. సర్వం తనకే అర్పించి సర్వకాల సర్వావస్థయలందు తననే సేవించే భక్తులను తానూ సేవించి ఆనందపడతాడు. ఈ బ్రహ్మాండంలో శ్రీమన్నారాయణుని మించిన భక్తుల పాలిట కల్పవృక్షం మరొకరు కనపడరు.

పూర్వకాలం మగధ దేశంలో నారాయణ శర్మ అనే మహా భక్తుడుండేవాడు. ఎల్లవేళలా హరినామ స్మరణతోనే కాలం గడిపేవాడు. ఎంతో నియమ, నిష్ఠలతో జీవితం గడుపుతూ తోటి వారందరికీ చేతనైన సహాయం చేస్తే, శ్రీనివాసుని గుణ గణాలను అందరికీ వివరిస్తూ కాలం గడిపేవాడు. కొంతకాలానికి తిరుమల శ్రీ స్వామివారిని దర్శించకోరి అలిపిరి చేరుకున్నాడు. అలిపిరి నుంచి కాలిబాటన స్వామినే స్మరిస్తూ నడకసాగించాడు. ఆహా! తన జీవితం ఎంత ధన్యం! ఆ స్వామిని దర్శించే



భాగ్యం కలిగింది కదా! అని తలుస్తూ నడుస్తున్నాడు. ఒక్కసారిగా పక్కనేనున్న చెట్టుక్రింద వేణువు ఊదుతున్న శ్రీకృష్ణుడు కనిపించాడు. ఇదేమిటి? కలయా? వైష్ణవమాయా? తను చూస్తున్నది నిజమేనా? ఎప్పటి ద్వాపరయుగంలోని శ్రీకృష్ణులవారు? నాకు ఇప్పుడు ఇలా దర్శన మీయడమా? తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు. ఒక్కసారి కళ్ళు నులుపుకుని మళ్ళీ చూశాడు. సాక్షాత్తూ శ్రీకృష్ణుడే! ఈ సారి మరింత చిరునవ్వుతో దర్శనమిచ్చాడు. ఎంత అద్భుతరూపం! ఎంతటి దివ్యతేజస్సు! ఎంతటి దివ్య సౌందర్యం! ఆహా! నా జన్మ ధన్యమయ్యింది! స్వామీ! శ్రీమన్నారాయణ! సాక్షాత్తూ శ్రీకృష్ణుని రూపంలో దర్శనమిచ్చావా తండ్రీ! ఎన్నో యుగాల ఘోర తపస్సులకు గానీ లభించని నీ దివ్యదర్శనం ఈ వేంకటాద్రిపై ఇంత అద్భుతంగా కలగడం ఎంత భాగ్యమని చెప్పను? అని తలుస్తూ శరీరం మైమరిపించగా ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు. మనస్సులో స్వామిని ఎన్నో విధాల స్తుతించాడు. కళ్ళు తెరిచేసరికల్లా శ్రీకృష్ణుడు అంతర్ధానమయ్యాడు. విశేషమేమంటే తన పిల్లనగ్రోవిని, రెండు మూడు నెమలి పింఛపు రేకలనీ వదిలివెళ్ళాడు. ఓ స్వామీ! ఇంతలోనే కనపడి ఇంతలోనే అంతర్ధానమైనావా! నా జన్మ తరించింది. అని పరిపరివిధాల తలచి ఆ రెంటినీ కళ్ళకద్దుకుని తీసుకుని తనతో తెచ్చుకున్న సంచీలో పదిలంగా భద్రపరచుకున్నాడు.

శ్రీమన్నారాయణునికి భక్తులపై గల ప్రేమ ఎంతటిదో కదా అని తలుస్తూ నారాయణ శర్మ నడక కొనసాగించాడు. ఎన్నో కష్టాలు పడుతూ ఈ కొండ నడిచి ఎక్కి తనను దర్శించే భక్తులంటే శ్రీనివాసునికి ఎంతో అనురాగం, ఎంతో ఆప్యాయత. వారికి తన అద్భుత దర్శనమిచ్చి

పరమానందంలో ముంచెత్తుతాడు. స్వామినే ప్రార్థిస్తూ ఒకొక్క మెట్టు ఎక్కుతున్న నారాయణ శర్మను చుట్టూ ఉన్న ప్రకృతి ఎంతో ఆహ్లాదపరిచింది. చెట్లమీద కోయిలలు ఎంతో చక్కగా పాడుతున్నాయి. చిలుకల జంటలు ఎంతో చక్కటి కబుర్లు చెప్పుకుంటున్నాయి. కోతుల గుంపులు ఒక చెట్టుమీద నుంచి మరో చెట్టుమీదకు దూకుతున్నాయి. పక్షుల కిల కిలా రావాలు.. చక్కటి సెలయేళ్ళు.. వేంకటాద్రి శోభ ఇంత, అంత అని వర్ణించతరం గాదు గదా! అని తలుస్తూ నడుస్తున్న నారయణ శర్మకు కొంత దూరంలో ఒక అద్భుత దృశ్యం గోచరించింది. సీతా, లక్ష్మణ సమేత రామచంద్రుల వారు ఒక చెట్టుక్రిందనే ఉన్న రాతిపై కూర్చుని ఉన్నారు. పక్కనే హనుమంతుడు ఏవో మాట్లాడుతున్నాడు. ఆ దివ్యదృశ్యం చూసిన నారాయణశర్మ నోటిమాట రావట్లేదు. మెల్ల మెల్లగా నడుస్తూ ఒక వేళ ఇది తన భ్రమేమోనని తలచాడు. కానీ ఆ దివ్యమూర్తులందరూ స్పష్టంగా కనిపించసాగారు. జగన్మాత సీతమ్మవారు శ్రీరామచంద్రులవారితో ఏదో చెప్తుండగా ఆ రామచంద్రుడు చిరునవ్వుతో వింటున్నాడు. అప్పుడు రామచంద్రులవారు చేయి ముందుకు పెట్టి తననే చూపుతూ లక్ష్మణునకు ఏదో చెప్తున్నాడు. ఆహా! ఎంతటి అద్భుత దృశ్యం. ఓ స్వామీ! శ్రీమన్నారాయణా! శ్రీనివాసా! జగన్నాథా! త్రేతాయుగంలోని శ్రీరామ చంద్రుని రూపంలో కూడా దర్శనమిచ్చావా తండ్రీ ! ఓ సీతమ్మతల్లీ! జగన్మాతా! నన్ను కరుణించావా తల్లీ! అంటూ ఆనందబాష్పాలు రాగా నారాయణశర్మ వారందరికీ నమస్కరించడం. విశేషం ఏమంటే తనతో పాటు నడుస్తున్న భక్తులు మాత్రం ఇవేమీ కనపడనట్లుగా వారి త్రోవన వారు నడుస్తున్నారు. అంటే ఈ దివ్యదర్శన భాగ్యం తనకేనన్నమాట!



ఆహా ! ఎంత అదృష్టవంతుడినో కదా! అని తలచి మరింత చేరువకు రాగానే ఒక్కసారిగా అందరూ అదృశ్యమయ్యారు. ఆ ప్రదేశంలోనే కాస్సేపు కూర్చున్నాడు నారాయణశర్మ. స్వామి దర్శన భాగ్యం చేత ఒళ్ళంతా పులకించింది. ఇక ఈ జన్మకు ఇంతకు మించిన భాగ్యం ఏమయ్యుంటుందని తలచాడు. ఆ స్వామినే తలుస్తూ, ప్రార్థిస్తూ కొండ ఎక్కి ఆనంద నిలయంలో స్వామిని దర్శించుకున్నాడు. శ్రీస్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని చూసిన నారాయణ శర్మ నోటికి మాట రాలేదు. ఆ సమయంలో స్వామి వారికి కర్పూర హారతి జరుగుతున్నది. ఆ హారతి సమయంలో స్వామి మరింత తేజస్సుతో కోటిసూర్య ప్రకాశంతో వెలుగొందుతున్నాడు. స్వామిని అనేక విధాల స్తుతించాడు.

తరతరాలుగా శ్రీ స్వామివారిని అనేకమంది భక్తులు ఎన్నో రీతులగా సేవించి తరించారు. ఎందరో మహారాజులు కాలినడకన తిరుమల చేరి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయలు తన జీవితకాలంలో ఏడుసార్లు స్వామివారిని దర్శించి అనేక ఆభరణాలను స్వామికి బహూకరించాడు. సారంగధరుడనే రాజు కొంతకాలం ప్రస్తుత తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాన్ని పరిపాలించాడు. ఆ సమయంలో ఆ రాజు వేంకటాద్రి మహాత్మ్యమును తెలుసుకుని స్వామివారిని అనేక మార్లు దర్శించుకున్నాడు. 'పున్నమి ఉత్సవాలు' అని ప్రతీ పౌర్ణమినాడు ఘనంగా నిర్వహించేవాడు. పౌర్ణమినాడు ఆనంద నిలయంలో స్వామి దివ్యంగా ప్రకాశిస్తాడు. ఆ రోజు దివ్య మనోహర మంగళ రూపం వర్ణించడానికి ఎవరి తరమూ కాదు. ప్రతీ పూర్ణిమనాడు భక్తులందరూ కాలినడకన బృందాలుగా ఏర్పడి కొండకు నడిచి ఎక్కేవారు. సారంగధరుని కాలంలో

స్వామిని ఎంతోమంది భక్తులు సేవించడానికి ప్రతీ పక్ష పౌర్ణమి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేవారు. మెట్లెక్కి వెళ్ళి ఆనంద నిలయంలో శ్రీ స్వామివారిని దర్శించుకుని ఎంతో ఆనందపడేవారు.

పూర్వకాలంలో అవంతీనగరంలో ధర్మాచార్యులు అనే సద్బ్రాహ్మణుడు ఉండేవాడు. సకల విద్యాపారంగతుడైన ఈ బ్రాహ్మణుడు ఎల్లప్పుడూ శ్రీ వేంకటేశ్వరుడినే తలుస్తూ ఒక వేద పాఠశాలను నిర్వహిస్తుండేవాడు. ఎంతో మంది శిష్యులకు వేద విశేషాలను వివరిస్తూ శ్రీమన్నారాయణుని గుణగణాలను వర్ణిస్తూ చెప్పేవాడు. అన్నీ విషయాలలోను ఎంతో సంతృప్తి కరంగా జీవిస్తున్న ధర్మాచార్యులవారికి ఎంత కాలానికీ సంతానం కలగకపోవడం చాలా బాధాకరంగా ఉండి శ్రీ స్వామి వారిని దంపతులిద్దరూ ఎన్నో విధాల సేవించారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నాయే గానీ వారికి సంతానం మాత్రం కలుగలేదు. చివరికి తమ భాగ్యం ఇంతే లెమ్మనుకున్నారు.

ఒకనాడు తెల్లవారుఝామున కలలో ఒక యతీశ్వరుడు కనపడి తిరుమల యాత్ర చేసి రావలసిందిగా సూచించాడు. ఇది బహుశా శ్రీనివాసుని అనుగ్రహమే అని తలచి వారిరువురూ బంధుమిత్ర పరివారంతో సహా తిరుమల యాత్ర సంకల్పించి, కొండనెక్కి స్వామిని దర్శించుకున్నారు. యాత్ర నుంచి తిరిగి రాగానే కొంతకాలానికి వారికి చక్కటి కుమారుడు కలిగాడు. ఆ దంపతులు ఎంతో సంతోషించి కుమారునికి వేంకటాచార్యులు అని నామకరణం గావించారు. వేంకటాచార్యులు ఆడుతూ, పాడుతూ ఎంతో ముచ్చటగా ఉండేవాడు. అయితే ఎంత ప్రయత్నించినప్పటికీ ఆ బాలునికి ఒక్క అక్షరం ముక్కైనా అబ్బింది కాదు. ధర్మాచార్యులవారు



చెయ్యని ప్రయత్నం లేదు. కుమారునికి ఎన్నో విధాల చెప్పిచూశాడు. ఎంత చెప్పినా, ఎంత ప్రయత్నించినా చదువు ఏ మాత్రం అతనికి రాలేదు. ఇంతలో ఆ ఊరికి ఒక మునీశ్వరుడు వచ్చాడు. ధర్మాచార్యులు తన కుమారుని తీసుకుని ఆ మునీశ్వరుని వద్దకు వెళ్ళి తన గోడు విన్నవించుకున్నాడు. ఎంతో మందికి వేద విద్యలన్నింటినీ నేర్పుతున్న తనకు తన కుమారునికి నేర్పించడం ఏ మాత్రం సాధ్యపడటల్లేదని విన్నవించుకున్నాడు. లేక లేక కలిగిన తన కుమారునికి చదువు ఎందుకు ఒంట బట్టటల్లేదో అర్థం కావడం లేదని వాపోయాడు. అప్పుడు ఆ మునీశ్వరుడు కళ్ళు మూసుకుని ధ్యానించి మాఘ పౌర్ణమినాడు వేంకటాద్రి నడిచి ఎక్కి స్వామిని దర్శిస్తే తప్పక మార్పు రాగలదని చెప్పాడు. మాఘమాసం అప్పటికి ఇంకా రెండు నెలలే. శ్రీమన్నారాయణుల వారికి అత్యంత ప్రీతికరం మాఘమాసం. ఈ మాఘమాసంలో ఏరోజైనా సరే స్వామి పుష్కరిణిలో స్నానమాచరించి శ్రీనివాసుని దర్శించినవారికి మరు జన్మ ఉండదు. ఈ జన్మలో సర్వ సౌభాగ్యాలనూ పొంది చివరన ముక్తిని పొందుతారు.

ధర్మాచార్యుల దంపతులు కుమారుడిని తీసుకుని వేంకటాద్రియాత్ర సంకల్పించి ఎన్నో ఊళ్ళు దాటుకుంటూ మాఘ పౌర్ణమినాటికి అలిపిరి చేరారు. కుమారునిచే మొదట మెట్టుకి నమస్కరింపచేసారు. శ్రీ స్వామివారినే తలుస్తూ కొండ ఎక్కసాగారు. అద్భుత ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులై, శ్రీ స్వామివారిని అనేక విధాల ప్రార్థిస్తూ కుమారునికి విద్యను ప్రసాదించవలసిందిగా వేడుకుంటూ ఎక్కసాగారు. ఒకవంతు కొండ ఎక్కే సరికి కొద్దిగా అలసట అన్పించి వారందరూ ఒక చోట విశ్రమించారు.

ధర్మాచార్యులవారికి కొద్దిగా కునుకు పట్టింది. ఒక్కసారిగా సామవేద గానం అతని చెవులకు ఎంతో ఇంపుగా వినపడింది. ఆహా! ఎంత అద్భుతంగా ఉన్నది? ఎవరబ్బా ఇంత శ్రావ్యంగా గానం చేస్తున్నవారు అని కళ్ళు తెరిచిన ధర్మాచార్యుల ఆశ్చర్యానికి అంతు లేదు. సామవేదం అంత అద్భుతంగా గానం చేస్తున్నది మరెవరో కాదు! సాక్షాత్తూ తన కుమారుడు వేంకటాచార్యులే! ఆహా! శ్రీనివాసా! అనుగ్రహించావా తండ్రీ! అని ఆ దంపతులిద్దరూ స్వామికి ఎన్నో విధాల మొక్కారు. ఇనుమడించిన సంతోషంతో కుమారునితో కలిసి తిరిగి నడక ప్రారంభించారు. సమస్త ఐశ్వర్యాలకు నిలయం ఈ కొండ. సమస్త విద్యలకూ నిలయం ఈ కొండ. ఈ కొండ ఒక్కసారి నడిచి ఎక్కితే చాలు సర్వ వేద సారమూ బోధ పడ్తుంది. సమస్త జ్ఞాన సంపదా లభిస్తుంది.

తోటి భక్తులతో కలిసి వారి భజనలు ఆనందిస్తూ నడవసాగారు. ఇలా కొంతదూరం నడిచేటప్పటికి రెండో వంతు పూర్తయింది. ఇక సగం మాత్రమే కొండ ఎక్కవలసి ఉంది. కాసేపు విశ్రమించుదామని తలచి కొంతమంది భక్తుల గుంపు వద్ద కూర్చున్నారు. ఏదో మాటలలో పడ్డవారికి కాసేపటికి పక్కన తమ కుమారుడు లేడని తోచింది. ఎక్కడికెళ్ళాడా అని చూసేటంతలో దూరంగా భక్తులతో ముచ్చటిస్తున్న కుమారుడు కనపడ్డాడు. ధర్మచార్యుల దంపతులిద్దరూ సమీపించేటప్పటికి ఒక విశేషం గమనించారు. వారి ఆనందానికి అంతులేదు. తమ కుమారుడు ఆ భక్తులకు యజుర్వేదంలోని కొన్ని ముఖ్య శ్లోకాల వివరణ చెప్తున్నాడు. ఈ విధంగా మిగిలిన సగం వంతు కూడా ఎక్కేసరికి వేంకటాచార్యులకు సర్వవేదాలూ, ఉపనిషత్తులూ స్వామి అనుగ్రహంచే బోధపడ్డాయి. కేవలం కొండ నడిచి



ఎక్కగానే సర్వ వేద విజ్ఞానమూ లభించింది. ధర్మాచార్యులు ఎంతో ఆనందపడి, స్వామిని పరి పరివిధాల ప్రార్థించాడు. ఆ కుటుంబమంతా కొండపైనే ఒక వారం రోజులపాటు ఉండి స్వామిని సేవించుకున్నారు.

సామాన్య మానవుల రూపంలో కొండ ఎక్కుతున్న ఇంద్రుడు, వరుణులకు ఎన్నో విశేషాలు కనిపిస్తున్నాయి. ఎన్నో విచిత్ర వేషధారణలతో కొండనెక్కుతున్న భక్తులను చూసి ఇంద్రుడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆహా! శ్రీమన్నారాయణుడంటే వీరందరికీ ఎంతటి భక్తి! ఎంతో దూరం నుంచి నడిచి వస్తున్నారు కదా! ఆహా! ఆ స్వామి మహిమ ఎంతటిది? అని పరిపరివిధాల ఆలోచిస్తూ కొండనెక్కి పైకి చేరుకున్నాడు. శ్రీమన్నారాయణుల వారినే ప్రార్థిస్తూ ఆనంద నిలయం ప్రవేశించాడు. కళ్ళు మూసుకుని స్వామిని మనస్సులో నమస్కరించాడు. కనులు తెరవగానే ఎదురుగా మహాశివుడు కనపడ్డాడు. ఇదేమిటి? ఇక్కడ ఉన్నది శ్రీమన్నారాయణులవారు కదా! శివుని దర్శనం కలిగినదేమిటి? అని మరొక్కమారు కనులు మూసుకుని శ్రీమహావిష్ణులవారిని ప్రార్థించాడు. శ్రీమన్నారాయణునే తలుస్తూ కనులు తెరిచిన ఇంద్రునికి ఈసారి బ్రహ్మదేవుడు దర్శనమిచ్చాడు. ఇదేమి విచిత్రం! అని తలచి తిరిగి కనులు మూసుకుని ధ్యానించాడు. కనులు తెరవగానే ఈ సారి విఘ్నేశ్వరుడు కనిపించాడు. ఆ తరువాత కుమారస్వామిగా దర్శనమిచ్చాడు. మరలా ప్రార్థించిన అనంతరం ఇంద్రునికి ఎదురుగా శక్తి స్వరూపిణి శ్రీ కనకదుర్గ దర్శనమిచ్చింది. తిరిగి కనులు మూసుకుని ధ్యానించగా ఇంద్రునికి సర్వం గోచరించింది. శ్రీమన్నారాయణుడు సకల దేవతా స్వరూపుడు. అన్నీ దేవతలూ శ్రీనివాసుని రూపాలే. పరబ్రహ్మమూర్తి శ్రీమన్నారాయణుని రూపాలే సర్వదేవతా

గణమూ. ఈ విధంగా తెలుసుకొనిన ఇంద్రునికి చివరగా శ్రీమన్నారాయణుని రూపంలో ఆనంద నిలయంలో దర్శనమిచ్చాడు. ఆ స్వామిని చూచిన ఇంద్రుని ఆనందానికి అంతు లేదు. ఓ స్వామి! శ్రీమన్నారాయణా! నీకివే నా నమస్కారములు. నీవు యజ్ఞస్వరూపుడవు. విశ్వరూపుడవు. మంగళ ప్రదుడవు. సర్వ వ్యాపకుడవు నీవే. నాపై దయవుంచి నన్ను బ్రహ్మ హత్యా పాతకము నుండి విముక్తిని గావించవలసినది. అని పరి పరి విధాల వేడుకున్నాడు.

అప్పుడు శ్రీనివాసుడు 'ఓ! ఇంద్రా! ఎప్పుడైతే నీవు ఈ వేంకటాద్రి కాలినడకన ఎక్కి నన్ను చేరావో అప్పుడే నీ పాపము నశించింది. ఈ సృష్టిలో నాకు అత్యంత ప్రియమైన ప్రదేశము ఈ వేంకటాద్రియే. నేను ఈ ఆనందనిలయములోనే గాక ఈ కొండల ప్రాంతమంతయూ ఎల్లప్పుడూ అనేక రూపాలలో విహరిస్తుంటాను. శ్రీ, భూ, నీలాసమేతంగా నేను ఈ తిరుమల కొండలలోని సెలయేళ్ళలో క్రీడిస్తుంటాను. ఎవరైతే ఈ కొండను నడిచి ఎక్కి నన్ను దర్శిస్తారో వారికి సర్వసౌభాగ్యాలూ అనుగ్రహిస్తాను. వారికి ఎటువంటి ఆపదలూ కలగవు. వారి భారం నేనే వహిస్తాను. నడిచి ఎక్కే సంకల్పం చేసినవారికి సమస్త సౌకర్యాలు నేనే కల్పించి నా దివ్యదర్శనం శీఘ్రగతిన అనుగ్రహిస్తాను. ఈకొండపై వారు వేసే ప్రతీ అడుగు వారిని ముక్తిపథం వైపు మరింత ముందుకు తీసుకువెళ్తుంది. సర్వదేవతా గణమూ ప్రతినిత్యం సామాన్య భక్తుల రూపంలో ఈ కొండ ఎక్కి నా దర్శనార్థమై వస్తున్నారు. ఆనంద నిలయంలో నన్ను దర్శించి బ్రహ్మానందమును పొందుచున్నారు. అన్ని యుగములందు, మానవులకు, దేవతలకూ ఇంతకు మించి ఆనందము మరొకటి లేదు. నా నివాస స్థలమైన ఈ వేంకటాద్రిని కేవలం ఒక్కసారి తలచినా సర్వపాపములూ నశించును.



రోజూ స్మరించే వారికి ఎటువంటి అనారోగ్యము దరిచేరదు. అష్టైశ్వర్యాలూ సిద్ధిస్తాయి. 'ఓ ఇంద్రా! ఈ సమస్త విశ్వంలో కెల్లా ఈ వేంకటాద్రి నాకు అత్యంత ప్రీతికరమైనది. ఇక్కడ చేసే ఎంత చిన్న పుణ్యకార్యమైన కోటి రెట్లు ఫలమీయగలదు. ఈ కొండపై ప్రతీ ప్రదేశంలో నా అంశ ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ కొండపై ఉన్నంత కాలం ఎవ్వరికీ నా ఆలోచన తప్ప మరొక ధ్యాస ఉండదు. వారందరి శరీరాలు దివ్య తేజస్సుతో నిండి ఉంటాయి. నా భక్తులంటే నాకు అత్యంత అనురాగం. ఎవ్వరైతే సర్వవేళలా నన్నే ప్రార్థిస్తూ ఉంటారో వారి సమస్త బాధ్యత నేనే వహిస్తాను' అని శెలవిచ్చాడు.

ఈ విధంగా శ్రీమన్నారాయణులవారు ఇంద్రునితో చెప్పుచుండగా సర్వదేవతా సమూహమూ యక్ష, కిన్నెర, కింపురుషాది సమస్తగణములూ ఆనంద నిలయంలో స్వామిని సేవించడానికై ప్రత్యక్షమైనాయి. అందరూ శ్రీమన్నారాయణుని పరిపరివిధాల ప్రార్థించి తమ తమ నిజ స్థానములకు పయనమైనారు. ఇంద్రుడు కూడా స్వామివారి వద్ద సెలవు తీసుకుని తనలోకమునకు పయనమయ్యెను.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

సమస్త సన్మంగళాని భవంతు
లోకాసమస్తా సర్వేజనా సుఖినోభవంతు
ఓం శాంతి శాంతి శాంతి